క్లుప్తంగా

చట్టాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న సీఐ సత్యనారాయణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ అన్నారు. స్థానిక శ్రీకృష్ణదేవరాయ నగరపాలక ఉన్నత పాఠశాలలో మంగళవారం పలు అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థినులు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అప్రమత్తంగా ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, చట్టపరమైన సమాచారం, సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మహిళా భద్రతపై శక్తి యాప్, డయల్ 112 వంటి అత్యవసర సేవల ప్రాముఖ్యతను వివరించారు. ఎస్సై మదీనా భాష, శక్తి టీమ్స్ సభ్యులు పాల్గొన్నారు.

7న చేనేత జాతీయ దినోత్సవం

ఏలూరు (టూటౌన్): ఆగస్టు 7 జాతీయ దినోత్సవాన్ని స్థానిక పత్తేబాద మరకవారి వీధి సెంటర్లో నిర్వహించనున్నట్టు ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పిచ్చుక ఆదిశేషు మంగలవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు నిర్వహించే పతాకావిష్కరణ కార్యక్రమంలో చేనేత కార్మికులు, ఉద్యమ శ్రేయోభిలాషులంతా పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

అవగాహన ర్యాలీ

దెందులూరు: వాట్సాప్ గవర్నమెంట్ పై ప్రజలకు అవగాహన పెంపొందించుకోవాలని శ్రీపర్రు వీఆర్‌ఓ సుబ్రహ్మణ్యం అన్నారు. బుధవారం శ్రీపర్రు వీఆర్‌ఓ కార్యాలయం, బస్టాండ్ సెంటర్, పశువైద్యశాల మీదుగా వీఆర్‌ఏలు అవగాహన ర్యాలీ నిర్వహించారు.

సకాలంలో పౌష్టికాహారం అందించాలి



చిన్నారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

దెందులూరు: చిన్నారులకు సకాలంలో పౌష్టికాహారం అందించాలని ఎంపీడీఓ కె.శ్రీలత అన్నారు. బుధవారం ఏలూరు రూరల్ మండలం పాలగూడెం అంగన్‌వాడీ కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ పి సునీత, ఎంపీడీఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిస్టర్లు, పౌష్టికాహారం పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు.

టౌన్ ప్లానింగ్ అధికారిపై ఫిర్యాదు

ఏలూరు (టూటౌన్): ఏలూరు కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారి సాంబశివరావుపై వచ్చిన అవినీతి ఆరోపణలపై సమగ్ర విచారణ చేయాలని దళిత సేన వ్యవస్థాపక అధ్యక్షులు జిజ్జువరపు రవి ప్రకాష్, దళితసేన ఏలూరు జిల్లా మహిళా అధ్యక్షురాలు బేతాళ జయసుధ వర్కింగ్ ప్రెసిడెంట్ స్టాలిన్ దళిత సేన జిల్లా జనరల్ సెక్రెటరీ లక్క పాము చంటి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏలూరు జిల్లా విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ పోలీస్ వారి కార్యాలయ ఇన్‌చార్జి డీఎస్పీ ఎస్ వెంకటేశ్వరరావుని కలిసి ఫిర్యాదు చేశారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 10 మందిపై కేసులు నమోదు చేశామని, వారిలో ఏడుగురిని కోర్టులో హాజరుపరచగా, నలుగురు వ్యక్తులకు మూడు రోజుల పాటు సామాజిక సేవ చేయాలంటూ న్యాయమూర్తి తీర్పు చెప్పారని ట్రాఫిక్ సీఐ ఎస్ లక్ష్మణరావు తెలిపారు. ఈనెల 2న నగరంలో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేయగా 10 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించామన్నారు. వీరిలో నలుగురిని సామాజిక సేవ చేయాలని, మరో ముగ్గురికి అపరాధ రుసుము న్యాయమూర్తి విధించారని ట్రాఫిక్ సీఐ మంగళవారం తెలిపారు.

మద్యం మత్తుకు తప్పదు భారీ మూల్యం

- మద్యం తాగి వాహనాలు నడిపితే రూ.10 వేల వరకు జరిమానా
- ఏలూరులో 2697 కేసులు నమోదు
- డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 337 కేసులకు అపరాధ రుసుం





ఏలూరులో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్ష చేస్తున్న ట్రాఫిక్ సీఐ లక్ష్మణరావు

ఏలూరు టౌన్: శుభకార్యమో.. పండుగో.. ఆదివారమో.. వీకెండ్ అనో పూటుగా మద్యం తాగి వాహనాలు నడిపితే భారీ మూల్యం చెల్లించుకోవాల్సిందేనని ట్రాఫిక్ పోలీసులు హెచ్చరిస్తున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు దేశవ్యాప్తంగా నూతన చట్టాన్ని అమల్లోకి తేవటంతో ఇష్టారాజ్యంగా మోటారు సైకిళ్లు, కార్లు, ఆటోలు నడుపుతామంటే ఇక కుదరనిపని. రోడ్డు ప్రమాదాల్లో అత్యధిక శాతం మద్యం మత్తులో మోటారు సైకిళ్లు మితిమీరిన వేగంతో నడపటమే ప్రధాన కారణంగా నిపుణులు నిర్ధారించారు. ఈ నేపథ్యంలో మద్యం తాగేసి మాకేమీ కాదులే అంటూ, రయ్ మంటూ మోటార్ సైకిళ్లపై వెళితే భారీ జరిమానా తప్పదని ఏలూరు ట్రాఫిక్ పోలీసులు స్పష్టం చేస్తున్నారు.

విస్తృత తనిఖీలు

ఏలూరు నగరంలో ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. వన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్ సర్కిల్స్ పరిధిలో సీఐలు, ఎస్సైలు నిత్యం వాహన తనిఖీలు, మద్యం తాగారా లేదా అనే పరీక్షలు చేస్తూ కేసులు నమోదు చేస్తున్నారు. మందుతాగి మోటారు సైకిల్ నడిపి పట్టుబడితే రూ.5 వేలు నుంచి రూ.10 వేలు వరకు భారీ జరిమానా తప్పదని అధికారులు హెచ్చరిస్తున్నారు. మరోవైపు కోర్టు ముందు హాజరుపరచగా, ఒక్కోసారి న్యాయమూర్తి జైలు శిక్షను విధించటం, సామాజిక సేవా కార్యక్రమాల్లో వినియోగించాలంటూ ఆదేశాలు జారీ చేస్తున్నారు. ఇప్పటికే ఏలూరు నగరం, పరిసర ప్రాంతాల్లోనూ పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించారు.

నిబంధనలు పాటించాల్సిందే

ఏలూరు ట్రాఫిక్ సర్కిల్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2025 జనవరి నుంచి జూలై 31వ తేదీ వరకు భారీ ఎత్తున వాహన తనిఖీలు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వారిపై కేసులు నమోదు చేశారు. ఏలూరులో ఈ ఏడు నెలల కాలంలో సుమారుగా 2697 కేసులు నమోదు చేశారు. వీటిలో ప్రధానంగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు 337, ధ్రువీకరణ పత్రాలు లేనివి 630, రాష్ డ్రైవింగ్ 226, హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపినవి 1048 కేసులు ఉన్నాయి. ఇక త్రిబుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్, ఇతర నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాహనాలపై 456 కేసులు నమోదు చేశారు. ఏలూరు నగరంలో ట్రాఫిక్ విపరీతంగా పెరిగిపోతున్న తరుణంలో ప్రజలు నిబంధనలు పాటించక తప్పదని పోలీసులు కోరుతున్నారు.

ప్రాణాలు విలువైనవి



రోడ్డు ప్రమాదాల చోటుచేసుకున్న సందర్భంలో అధిక శాతం మద్యం మత్తులో జరిగినవే కావటం, పైగా హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతూ ఉండడంతో తలకు తీవ్ర గాయాలతో ప్రాణాలు కోల్పోవటం బాధాకరం. కుటుంబంలోని ఒక వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మరణిస్తే ఆయా కుటుంబాలు తీవ్ర ఆర్థిక, సామాజిక నష్టాన్ని చవిచూస్తాయి. మితిమీరిన వేగం, మద్యం మత్తు మనిషి ప్రాణాలతో చెలగాటం ఆడకుండా ఉండేందుకు నిత్యం వాహన తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేస్తున్నాం. ఇటీవల మద్యం తాగి వాహనాలు నడిపుతూ పట్టుబడితే భారీగా జరిమానాలు విధించేలా చట్టాలు ఉన్నాయి. ప్రజలు దీనిపై అవగాహన కలిగి జాగ్రత్తలు పాటించాలి.

– ఎస్ లక్ష్మణరావు, ట్రాఫిక్ సీఐ

విద్యార్థుల హక్కులను హరిస్తున్న ప్రభుత్వం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రభుత్వ పాఠశాలల్లోకి మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు మినహా ఎవరిని అనుమతించరాదని పాఠశాల విద్యాశాఖ ఇచ్చిన ఉత్తర్వులు విద్యార్థుల స్వేచ్ఛను, ప్రజాస్వామిక హక్కులను హరించే విధంగా ఉన్నాయని ఎస్ఎఫ్ఐ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నగర నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన ఈ ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ జీఓ ద్వారా విద్యార్థుల సమస్యలు బయటకి రాకుండా విద్యార్థుల నోరు నొక్కే ప్రయత్నమేనని అర్థం అవుతోందన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విద్యార్థి సంఘాలతో సంప్రదింపులు చేసిన విషయాన్ని గుర్తిచేశారు. ఎటువంటి రాజకీయాలకు తావివ్వొద్దని చెబుతున్న విద్యాశాఖ పీటీఎం పేరుతో చేసేందేమిటని, ఎమ్మెల్యేలు, వారి అనుచరులు పాఠశాలల్లోకి వచ్చి సమస్యలు చెప్పినవారిని బెదిరించిన ఘటనలు కూడా ఉన్నాయని వివరించారు. ఈ ఉత్తర్వుల ద్వారా ఇక నుంచి ప్రైవేట్ కార్పొరేట్ సంస్థల వ్యాపారం, అన్యాయాలను బయటకు తీసే అవకాశం లేకుండా పోతుందని, దీంతో వారి దోపిడీ పెంచుకునేందుకు దోహదపడుతుందని తెలిపారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఆ ఉత్తర్వులను వెంటనే రద్దు చేసి, పాఠశాలల్లో ప్రజాస్వామిక వాతావరణం ఉండే విధంగా చూడాలని నాయకులు డిమాండ్ చేశారు.

అభివృద్ధి, సంక్షేమానికి మంగళం



45వ డివిజన్‌లో మాట్లాడుతున్న సమన్వయకర్త జేపీ



ముస్లిం నాయకులు, కార్యకర్తలతో సమన్వయకర్త జేపీ

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త జేపీ

ఏలూరు టౌన్: రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అభివృద్ధిలో వెనక్కి వెళ్లామని, ప్రజా సంక్షేమానికి తిలోదకాలు ఇస్తూ టీడీపీ నేతలు రాష్ట్రాన్ని అథోగతిపాలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ (జేపీ) విమర్శించారు. ఏలూరు నగరంలో 45వ డివిజన్‌లో మంగళవారం రాత్రి బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమం కంచుమర్తి తులసీ, పిల్లా బుజ్జమ్మ, బేతపూడి కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలను ఏవిధంగా మోసం చేశారో, సంక్షేమ పథకాలు ఇవ్వకుండా అన్ని వర్గాలకు ఏ విధంగా మోసం చేస్తున్నారో సమన్వయకర్త జేపీ, నగర అధ్యక్షులు గుడిదేశి శ్రీనివాస్ వివరించారు. రీకాలింగ్ బాబూస్ మేనిఫెస్టో క్యూఆర్ కోడ్ ఫ్ల కార్డులను ప్రదర్శించారు. వీటిని స్కాన్ చేస్తే టీడీపీ హామీల బండారం బయటపడుతుందని ప్రజలకు వివరించారు.

టీడీపీ చరిత్ర మోసపూరితం

సమన్వయకర్త జయప్రకాష్ మాట్లాడుతూ టీడీపీ, జనసేన అధినేతలు ఎన్నికల హామీలతో కూడిన పత్రాలను 2024 ఎన్నికలకు ముందు ప్రజలకు ఇంటింటికీ పంచిపెట్టారని, తీరా ప్రజలు ఆశపడి ఓట్లు వేస్తే అధికారం చేపట్టిన అనంతరం మోసం చేశారని ఆరోపించారు. 19 ఏళ్ల నుంచి 59 ఏళ్ల మహిళలకు నెల నెలా రూ.1500 వేస్తానని నమ్మించారని, నిరుద్యోగ యువతకు కంపెనీలు వస్తున్నాయని 20 లక్షల ఉద్యోగాలు లేదా రూ.3 వేల నిరుద్యోగ భృతి అంటూ ఆశపెట్టారని, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన, తల్లికి వందనం అంటూ ఇలా అన్నివర్గాలను దారుణంగా మోసం చేసిన చరిత్ర టీడీపీకే దక్కుతుందన్నారు. ఏలూరు నగరంలోనూ అభివృద్ధి చేసిన దాఖలాలు ఏమీ లేవన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి కుటుంబానికి అనేక సంక్షేమ పథకాలు వచ్చాయనీ, ఇంటికే ప్రభుత్వ సేవలు అందాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు బి.బాబి, లక్ష్మి, రాజేశ్వరి, అంజిబాబు, సంజన, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు నెరుసు చిరంజీవి, మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుమరాడ స్రవంతి, నగర బీసీ సెల్ అధ్యక్షులు కీలాడి దుర్గారావు, వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఘంటా మోహనరావు, నాయకులు బోగాది ప్రభాకర్, మేతర సురేష్, మహిళా నేతలు రూబీనా, నామాల రమేష్, సముద్రాల చిన్నీ, యువజన నాయకులు దాలి వెంకటేష్, బండ్లమూడి సునీల్, సాయి, ఫణి, సత్యనారాయణ, మహిళలు, యువత పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

మొరాయించిన సర్వర్.. తపాలా సేవల్లో జాప్యం



పెద్ద పోస్టాఫీసులో క్యూ కట్టిన వినియోగదారులు

ఏలూరు (టూటౌన్): డిజిటల్ ఫ్లాట్ ఫాంపైకి తపాలా సేవలను తీసుకొచ్చామంటూ తపాలా శాఖ అధికారులు చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. ఈ డిజిటల్ సేవలు ప్రారంభించిన 10 రోజులకే మొరాయించడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. గంటల కొద్దీ వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇందుకు మంగళవారం పెరుగుచెట్టు సెంటర్‌లోని పెద్ద పోస్టాఫీసులో నెలకొన్న పరిస్థితి అద్దం పడుతుంది. గత నెల 22న జిల్లాలోని అన్ని ప్రధాన తపాలా కార్యాలయాలు, శాఖలను ఏపీకే యాప్స్ ద్వారా డిజిటలైజేషన్ చేసి, అట్టహాసంగా ప్రచారం చేశారు. స్థానిక పెద్ద పోస్టాఫీసులో మంగళవారం సర్వర్లు రెండు గంటలపాటు పనిచేయలేదు. వినియోగదారులు భారీ సంఖ్యలో నిరీక్షించాల్సి వచ్చింది. సర్వర్ల సమస్యను సాకుగా చూపి సిబ్బంది తమను గంటల కొద్దీ వేచి ఉంచడం ఎంత వరకు సమంజసమని వినియోగదారులు ప్రశ్నించారు. సిబ్బందికి సరైన శిక్షణ లేకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోకుండా డిజిటలైజేషన్ సేవలు ప్రారంభించిన తపాలా శాఖపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది మాన్యువల్‌గా కూడా సేవలు అందించడంలేదని ఆరోపించారు. సేవల్లో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని తపాలా శాఖ అధికారులను వినియోగదారులు ముక్త కంఠంతో కోరుతున్నారు.

తల్లిపాలతో బిడ్డకు ఆరోగ్యం



మాట్లాడుతున్న సీడీపీఓ పద్మావతి

ఏలూరు (టూటౌన్): పుట్టిన అరగంటలోపు బిడ్డకు తల్లిపాలు ఇవ్వాలని, ముర్రిపాలలో కొలెస్ట్రమ్ విటమిన్ ఏ పోషకాలు అధిక మోతాదులో ఉండడం వల్ల బిడ్డ ఆరోగ్యంగా పెరగడానికి అవకాశం ఉంటుందని ఏలూరు అర్బన్ ప్రాజెక్ట్ సీడీపీఓ పద్మావతి, యూహెచ్‌సీ డాక్టర్ గౌతమ్ రాజ్, హెచ్‌వీ ఝాన్సీ అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా ఏలూరు గవర్నమెంట్ మెడికల్ కాలేజ్ యూహెచ్‌సీ పరిధిలో గర్భిణులు, బాలింతలకు తల్లిపాలపై మంగళవారం అవగాహన కల్పించారు. బిడ్డకి ఆరు నెలల నిండే వరకు తల్లిపాలు మాత్రమే పట్టించాలన్నారు. రెండేళ్ల వరకు తల్లిపాలతో పాటు అనుబంధ పోషకాహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మౌనిక, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పి.హైమావతి, అన్నపూర్ణ, మంగమ్మ, నాగమణి, సీయోను కుమారి, మనీ కృష్ణవేణి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అధ్వానంగా మహేశ్వరపురం పాఠశాల



పాఠశాలలో గుంతలు పడిన గచ్చు





కనెక్షన్ కట్ చేసిన విద్యుత్ మీటరు

దెందులూరు: కనీస వసతులు లేక ఏలూరు రూరల్ మండలం మహేశ్వరపురం ప్రాథమిక పాఠశాల అధ్వానంగా తయారైంది. విద్యార్థులు కూర్చోవడానికి బెంచీలు కూడా లేవు. శ్రీపర్రు గ్రామం నుంచి మధ్యాహ్న భోజన నిర్వాహకులు తాగునీరు తీసుకొస్తున్నారు. తరగతి గదుల్లో గచ్చు పగిలిపోయి గుంటలు ఏర్పడ్డాయి. బిల్లు కట్టకపోవడంతో విద్యుత్ సరఫరాను ఆ శాఖ నిలిపేసింది. ఈ పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 20 మంది విద్యార్థులు, ఒక ఉపాధ్యాయులు ఉన్నారు. అధికారులు స్పందించి పాఠశాలలోనే తాగునీరు, కూర్చోవడానికి బెంచీలు ఏర్పాటుచేయాలని, పగిలిన గచ్చును బాగుచేయించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

పాఠశాల గ్రంథాలయానికి పుస్తకాలు



పాఠశాలకు వచ్చిన గ్రంథాలయ పుస్తకాలు

దెందులూరు: ప్రభుత్వం పాఠశాల గ్రంథాలయాలకు ఇచ్చే విజ్ఞాన పుస్తకాలను మంజూరు చేసిందని ఏలూరు రూరల్ మండలం మానూరు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు తేరా ప్రసాద్ అన్నారు. పాఠశాలలో గ్రంథాలయ పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు పడాల అరుణ ఉన్నారు.

అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

ద్వారకాతిరుమల: మండలంలోని గుణ్ణంపల్లి హైస్కూల్ విద్యార్థినులు ముగ్గురు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయుడు డి.వరప్రకాశం తెలిపారు. గత ఆదివారం ఏలూరులో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో టి.రోషిణి హై జంప్‌లో, కె.రమ్యకృష్ణ 600 మీటర్ల పరుగు పందెంలో, కె.ఐశ్వర్య లాంగ్ జంప్‌లో ప్రథమ స్థానాల్లో నిలిచి రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఈనెల 9 నుంచి 11 వరకు బాపట్లలో జరిగే ఈ అథ్లెటిక్స్ పోటీల్లో విద్యార్థినులు ఆడతారని తెలిపారు. వీరిని హెచ్ఎం వరప్రకాశం, సర్పంచ్ టి.సుజాత, ఎస్ఎంసీ చైర్మన్ గోకర్ణేశ్వరరావు అభినందించారు.

యూరియా కొరత నివారించాలి

ఏలూరు (టూటౌన్): జిల్లాలోని రైతాంగ సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఏలూరు జిల్లా కమిటీ సమావేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. మంగళవారం ఏలూరు అన్నే భవనంలో కట్టా భాస్కరరావు అధ్యక్షతన నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశంలో సమస్యలపై చర్చించి పలు తీర్మానాలు ఆమోదించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ యూరియా కొరత నివారించాలని, పెంచిన ఎరువుల ధరలు తగ్గించాలని కోరారు. ఉచిత పంటల పథకాన్ని అమలు చేయాలన్నారు. పంటల బీమా పథకం నిబంధనలు సడలించి రైతులకు పంటల బీమా పరిహారాలు అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. కృష్ణా, గోదావరి డెల్టాల శివారు ప్రాంత భూములకు సాగునీరు అందించాలన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్ల బిగింపు ఆపాలని డిమాండ్ చేశారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభించాలని కోరారు. భూసేకరణలో భూములు కోల్పోతున్న రైతులకు 2013 భూ సేకరణ చట్ట ప్రకారం పరిహారం చెల్లించి ఆదుకోవాలన్నారు. సమావేశంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శులు కోన శ్రీనివాసరావు, బొడ్డు రాంబాబు, జిల్లా కమిటీ సభ్యులు సున్నా వెంకటరావు, లావేటి సోంబాబు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ వేములపల్లి కార్యవర్గం ఎన్నిక

లింగపాలెం: మండలంలోని వేములపల్లి గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షులుగా కొల్లి శ్రీను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం పార్టీ గ్రామ అబ్జర్వర్, మాజీ సొసైటీ అధ్యక్షుడు రెడ్డిన శ్రీను ఆధ్వర్యంలో వేములపల్లి కమిటీని పార్టీ లింగపాలెం మండల అధ్యక్షుడు అన్నపనేని శాంతారావు ప్రకటించారు. అధ్యక్షుడిగా కొల్లి శ్రీను, ప్రధాన కార్యదర్శులుగా బొమ్మిడి శ్రీనివాస్‌రెడ్డి, తోలం విజయ్, బుల్లివరపు రాంబాబు, తాడేపల్లి కృష్ణారావు, కార్యదర్శులుగా బుల్లివరపు నాగరాజు, బండి రాము, నత్త పాపారావు, ఉప్పులూరు సురేష్, చిరి నాగరాజులు ఎన్నికయ్యారు. పార్టీ పటిష్టతకు కృషి చేస్తామని నూతన కార్యవర్గం పేర్కొంది.

డ్రోన్ నిఘా

ద్వారకాతిరుమల: శాంతిభద్రతల పరిరక్షణతో పాటు, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు డ్రోన్ నిఘా వ్యవస్థ ఎంతగానో ఉపయోగపడుతుందని సీఐ యుజే విల్సన్ అన్నారు. ద్వారకాతిరుమలలోని పలు బహిరంగ ప్రదేశాల్లో మద్యపానాన్ని అదుపు చేసేందుకు, అసాంఘిక కార్యక్రమాలను అరికట్టేందుకు ఎస్సై టి.సుధీర్‌తో కలసి మంగళవారం సాయంత్రం ఆయన డ్రోన్ సహాయంతో నిఘా కార్యక్రమాన్ని నిర్వహించారు. భీమడోలు సర్కిల్ పరిధిలో అసాంఘిక కార్యక్రమాలను అరికట్టేందుకు నిరంతరం నిఘా కొనసాగుతుందని, పోలీసులకు సహకరించాలని ప్రజలను కోరారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	35
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	27
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	35
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	19
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	24
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.15	4822	23
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	16
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	25
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	14
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	26
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	23
ఏలూరు - తిరుపతి	16.00	4830	34

నిధులు విడుదల చేయాలి



కార్యక్రమంలో పాల్గొన్న గిరిజన సర్పంచ్‌లు

బుట్టాయగూడెం: గత 7 నెలలుగా గ్రామ పంచాయతీలకు రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు రాకపోవడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నామని గిరిజన సర్పంచ్‌లు బన్నే బుచ్చిరాజు, తెల్లం రాముడు, ఉయికే బొజ్జిలు తెలిపారు. మంగళవారం సాయంత్రం వారు విలేకర్లతో మాట్లాడుతూ సర్పంచ్‌ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విజయవాడలో జరిగిన కార్యక్రమంలో గిరిజన సర్పంచ్‌లు పాల్గొన్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు విడుదల చేయకపోవడం వల్ల పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేపట్టలేక పోతున్నామని తెలిపారు. ఇప్పటికై నా నిధులు మంజూరు చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

షాపులకు ఉచిత విద్యుత్ అమలు చేయాలి



సమావేశమైన నాయీ బ్రాహ్మణులు

జంగారెడ్డిగూడెం: ఎన్నికల సమయంలో నాయీ బ్రాహ్మణ బార్బర్ షాపులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ హామీని అమలు చేయాలని నాయీబ్రాహ్మణులు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నెలవారీ సమావేశం స్థానిక నాయీ బ్రాహ్మణ కమిటీ హాల్‌లో అధ్యక్షుడు తాడి శ్రీను ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. సంఘం చింతలపూడి నియోజకవర్గ అధ్యక్షులు చిప్పాడ నరసింహారావు మాట్లాడుతూ బార్బర్ షాపులకు గత ప్రభుత్వం 150 యూనిట్లు ఉచిత విద్యుత్ అమలు చేసిందని, కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన 200 యూనిట్ల ఉచిత విద్యుత్ హామీని 13 నెలలు కాలం గడుస్తున్నప్పటికీ అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘం గౌరవ అధ్యక్షులు, సలహాదారులు కంకిపాటి సత్యనారాయణ, ఎస్ ఆనందరావు, వల్లూరి వెంకట్ పుప్పాల కృష్ణ, మల్లవరపు నాగపాసు, ఉపాధ్యక్షులు కోడూరి మురళి, సెక్రటరీ కొప్పుల రామకృష్ణ, జాయింట్ సెక్రటరీ నడింపల్లి బంగారు నాగు, యూత్ అధ్యక్షులు శిలరపు ప్రశాంత్ రాజ్, కార్యవర్గ సభ్యులు మలువలస సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.